
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



జగిత్యాల
5★★ జిల్లా వార్తలు
ఆదివారం 12 అక్టోబరు 2025

గోదావరిలో స్నానం చేస్తే సర్వపాపాలు తొలగిపోతాయి

నవ నారసింహ క్షేత్రాల్లో ధర్మపురి ఒకటి

ఆధ్యాత్మిక వేత్త, ప్రవచన కర్త చాగంటి కోటేశ్వర్‌రావు

6



చాగంటి కోటేశ్వర్‌రావును సన్మానిస్తున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్

శ్రీరాంసాగర్ వరద గేట్లు మూసివేత

జగిత్యాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌కు వరద నీరు రావడం తగ్గడంతో శనివారం వరద గేట్లను మూసివేశారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 10,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇందులో కాకతీయ కాలువకు 5,000, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కొడిమ్యాల, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 170మందికి శనివారం మండల కాంగ్రెస్ నాయకులు 39లక్షల 26 వేల రూపాయల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసారు. ఈ పంపిణీ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలువేరి నారాయణగౌడ్, మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డం జీవన్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ కడారి మల్లేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, గంగన్న ఉన్నారు.

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

రాయికల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విజ్డమ్ హైస్కూల్ కరస్పాండెంట్ ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డి అన్నారు. రాయికల్ పట్టణంలోని విజ్డమ్ హైస్కూల్‌లో శనివారం రోబో చాంప్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లానిటోరియం షో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అంతరిక్షంలోని వాతావరణం, గ్రహాలు, నక్షత్రాలు, చంద్రుడి మీద ఉండే వాతావరణం, ఉపగ్రహాల ప్రయోగం, సముద్రం లోపల నివసించే జీవులు, సముద్ర గర్భంలో ఉండే ఖనిజాలు, శిలాజాలు, నీటి అలజడుల గురించి అవగాహన కల్పించారు. సాంకేతికతను చెడు కోసం కాకుండా మంచి పనులకు ఉపయోగించుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నివేదితరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు ప్రణాళిక సిద్ధం



- వానాకాలం లక్ష్యం 7.5 లక్షల నుంచి 8 లక్షల మెట్రిక్ టన్నులు
- నెలాఖరు వరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- జిల్లాలో 3.15 లక్షల ఎకరాల్లో వరి సాగు
- క్వింటాలుకు గ్రేడ్ -1 ధాన్యానికి రూ.2,389 మద్దతు ధర

జగిత్యాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వానాకాలంలో సాగైన వరి ధాన్యం సేకరణకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. మరో నెల రోజుల్లో దిగుబడి వచ్చే అవకాశం ఉండడంతో ముందస్తుగా ధాన్యం సేకరణ ఏర్పాట్లపై వ్యూహరచన చేస్తున్నారు. జిల్లాలో ఆలస్యంగా వరి నాట్లు వేసుకోవడంతో ఈ నెలాఖరు వరకు కోతలు ప్రారంభం కానుండడంతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో 7.50 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 8 లక్షల మెట్రిక్ టన్నుల వరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, దిగుబడి అంచనా, వసతులు తదితర ఏర్పాట్లపై జిల్లా పౌరసరఫరా శాఖ, వివిధ ఏజన్సీలు, రైస్ మిల్లర్లతో ఇటీవల కలెక్టర్ సత్య ప్రసాద్ నేతృత్వంలో అధికారులు సమావేశం నిర్వహించారు.

జిల్లాలో 421 కొనుగోలు కేంద్రాలు..

జిల్లాలో వానాకాలం సీజన్ 2025-26 సంవత్సరానికి గాను 421 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో ఐకేపీ కేంద్రాలు 187, సహకార సంఘాల కేంద్రాలు 283, ఒకటి మెప్మా ఆధ్వర్యంలో కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. సుమారు 60 లక్షల గన్నీ సంచులు అవసరమని అంచనా వేశారు. దిగుబడి సమయానికి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అందజేస్తామని పౌర సరఫరాల శాఖ అధికారులు అంటున్నారు. ప్రతి కేంద్రంలో కొనుగోలుకు సంబంధించిన రిజిస్టర్లు, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, వేయింగ్ యంత్రాలు, టార్పాలిన్ కవర్లు ఇతర వసతులు ఉండేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. హమాలీల కొరత లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై దృష్టి పెట్టారు. ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను ముందుగానే సిద్ధం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి రైతుల ఖాతాల్లో త్వరగా నగదు జమ అయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

ఆలస్యంగా వరి నాట్లు..

జిల్లాలో కొన్నేళ్లుగా వానాకాలంలో ఎక్కువగా వరి సాగు చేస్తున్న రైతులు ప్రస్తుత సీజన్‌లో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ఆలస్యంగా వరి నాట్లు వేశారు. 75 శాతం దొడ్డు రకం, 25 శాతం సన్నరకం వరి సాగైనట్లు అంచనాలున్నాయి. సన్నరకం ఇంటి అవసరాల కోసమే నిల్వ ఉంచుకోనున్నారు. యాసంగిలో 95 శాతం దొడ్డు రకం సాగు ఉంటుంది. దిగుబడి వచ్చిన ధాన్యంలో 90 శాతం కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి వస్తుంది. జూలైలో భారీ వర్షాలు, వరదల కారణంగా మొదట్లో నాట్లు వేసుకున్న పంట కొట్టుకపోవడం, ఇసుక మేటలు వేయడంతో రెండోసారి నారు పోసుకొని ఆగస్టు నెలాఖరు వరకు నాట్లు వేశారు. సాగు ఆలస్యం కావడంతో స్వల్పకాలిక దొడ్డు రకాల వరిసాగుకు ఎక్కువగా మొగ్గు చూపారు. దీంతో ఈ వానాకాలం సీజన్‌లో గతంలో కంటే ఎక్కువగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చే అవకాశం ఉంది.

జిల్లాలో 3.15 లక్షల ఎకరాల్లో వరి సాగు..

జిల్లాలో ప్రధానంగా వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది సాగు విస్తీర్ణం గత ఏడాది కంటే పెరిగింది. గత యేడాది వానాకాలం సీజన్‌లో 3 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 3,15,562 ఎకారల్లో రైతులు వరిని సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 7.50 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 8 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు.

ఇందులో రైతుల అవసరాలు, ఇతర కంపెనీల విత్తనాలు పోను కొనుగోలు కేంద్రాలకు 5.50 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎక్కువగా దొడ్డు రకం వరి సాగు కావడంతో ధాన్యంలో 75 శాతం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉంది.

పెరిగిన మద్దతు ధర..

గత సీజన్‌లో కంటే ప్రస్తుత యేడాది మద్దతు ధరను పెంచి ఏ గ్రేడ్ ధాన్యానికి

మిగతా 8వ పేజీలో

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి: సత్యప్రసాద్, కలెక్టర్

ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరించడానికి అనుగుణంగా ముందస్తుగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే ఇందుకు అవసరమైన అంచనాలు రూపొం దించాం. సీజన్‌లో దిగుబడి కానున్న వరి ధాన్యం, ఏర్పాటు చేయాల్సిన కేంద్రాలు, ధాన్యం తరలింపుకు వాహనాలు, నిల్వలకు గోదాములు, హమాలీలు, గన్నీ బ్యాగులు తదితర ఏర్పాట్లపై దృష్టి సారించాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నాణ్యమైన ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను రైతులు పొందాలి. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.



పేదలకు విద్య, వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్




మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అర్బన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పేదలకు విద్య, వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని మోతె పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు సాధ్యమైనంత వరకు సహాయం అందిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అత్యధిక పల్లె దవాఖానాలు జగిత్యాల నియోజక వర్గంలో ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. దీనితో పేద, మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతోందని ఎమ్మెల్యే అన్నారు. తరకు ఓట్లేసి గెలిపించిన ప్రజలే ముఖ్యమని, అందుకోసం ముఖ్యమంత్రితో కలిసి పని చేస్తున్నానని ఆయన స్పష్టం చేశారు.

ప్రభుత్వ సహకారంతో ఏటీసీ సెంటర్, మహిళా శక్తి భవనం, చల్‌గల్ దగ్గర రెండు వందల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. జిల్లా ప్రజలకు అత్యవసర వైద్యం కోసం 20 కోట్ల రూపాయలతో నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్‌ను త్వరలో ప్రారంభించనున్నామన్నారు. 203 కోట్ల రూపాయలతో జిల్లా కేంద్రంలో నూతన ఆసుపత్రి నిర్మాణం త్వరలో ప్రారంభిస్తామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, అడువాల లక్ష్మణ్, బాలె శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పేదలు ఇందిరమ్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పేదలు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వేములవాడ శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఇల్లు నిర్మాణం కోసం ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహాయాన్ని పొంది ఇల్లు పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. శనివారం మేడిపల్లి మండలం కాచారం గ్రామంలో బర్ల సాయమ్మ ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి విప్ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారుకు గతంలో ప్రకటించిన విధంగా నూతన వస్త్రాలు అందజేశారు. గతంలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ సందర్భంగా మేడిపల్లి మాజీ సర్పంచ్ బొంగోని రాజాగౌడ్ మండల పరిధిలో మొట్టమొదటిగా పూర్తి చేసుకొనే లబ్ధిదారుకు రూ.50,116 ఆర్థిక సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వ విప్ చేతుల మీదుగా లబ్ధిదారుకు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, మాదం వినోద్, నాగరాజు, దామోదర్, లాజర్, సాల్మన్, గంగదర్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



వేడుకల్లో పాల్గొన్న అంగన్‌వాడీలు

రాయికల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి సూచించారు. రాయికల్ మండలంలోని ఒడ్డెలింగాపూర్ గ్రామంలో శనివారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి ఆధ్వర్యంలో శనివారం పోషణ మాస వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగ్యానాయక్ తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, ఆశ వర్కర్ మాలవత్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బీర్‌పూర్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను శనివారం బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో జగిత్యాల జిల్లా సీఐటీయూ కార్యదర్శి పులి మల్లేశం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బేతి లచ్చన్న, నాయకులు కనుక వికాస్, పూదారి నర్సయ్య, బొమ్మి గంగన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు కోతుల బెడదను నివారించాలి

- ప్రతి జిల్లాలో స్టెరిలైజేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలి
- మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి

జగిత్యాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో వ్యవసాయం కనుమరగయ్యే పరిస్థితి నుంచి రక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోతుల బెడద నివారణపై దృష్టి సారించాలని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఇందిరా భవన్ కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోతుల పునరుత్పత్తిని నిరోధించడానికి ప్రతీ జిల్లాకు ఒకటి చొప్పున స్టెరిలైజేషన్ సెంటర్లు ఏర్పరచాలని సూచించారు. విడతల వారీగా మండలానికి ఒకటి స్టెరిలైజేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసర ముందన్నారు. తక్షణ నివారణకు రైతులు పంట భూమి సరిహద్దులో సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసుకోవడానికి రాయితీని ప్రకటించాలన్నారు. రసాయనిక ఎరువులు, పురుగుల మందుల వాడకం తగ్గించాలని, సేంద్రీయ సాగు చేయాలని చెప్పడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, సీఎం రేవంత్ రెడ్డితో పాటు చట్ట సభలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులందరికీ సమస్య పరిష్కారాన్ని కోరుతూ లేఖలను పంపిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దుర్గయ్య, చాంద్‌పాషా పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఆధార్ కేంద్రం మూసివేత

- గదులు సరిపోని వైనం
- కథలాపూర్‌లో 10 రోజులుగా నిలిచిన సేవలు

కథలాపూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కొన్నేళ్ళుగా కొనసాగుతున్న ఆధార్ కేంద్రాన్ని మూసివేశారు. కార్యాలయంలో గదులు సిబ్బందికి సరిపోకపోవడంతో నిర్వాహకుడికి ఆధార్ కేంద్రంను తొలగించాలని ఆదేశించడంతో పదిరోజులుగా సేవలు నిలిచిపోయాయి. గత నెలలో గ్రామ పాలనాధికారులు రావడంతో అసలే ఇరుకుగా ఉన్న కార్యాలయంలో స్థలం సరిపోవడం లేదు. రెండు గదులు పహాణీలు, వన్‌బీలు, ధరణి, భూభారతికి సంబంధించిన రికార్డులు నిల్వ చేస్తుంటారు. రిజిస్ట్రేషన్ల కోసం భూభారతి ఆపరేటర్‌కు గది, మరో గదిలో డిప్యూటీ తహసీల్దార్, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు విధులు కొనసాగిస్తుంటారు.

రెవెన్యూ పరిశీలకుడు, సర్వేయర్, మరో ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, వివిధ ధృవీకరణ పత్రాలు జారీ చేసే ఆపరేటర్ కోసం గదులు ఉన్నాయి. ఈ గదిలోనే ఆధార్ కేంద్రంను తక్కళ్ళపల్లికి చెందిన రంగు గంగారాం నిర్వహిస్తున్నాడు. సిబ్బందికే గదులు పూర్తిస్థాయిలో సరిపడక పోగా గ్రామ పాలనాధికారులు ఉండేందుకు వీలు లేకుండా మారింది. పలు సందర్భాల్లో సిబ్బందికి సమావేశాలు నిర్వహించేందుకు కూడా గది లేదు. ఈ పరిస్థితుల నేపథ్యంలో కేంద్రం నిర్వాహణ కష్టంగా మారిందనే కారణంతో మూసివేశారు. దీంతో కొత్తగా ఆధార్ కార్డు పొందడం, చేర్పులు, మార్పులు, పిల్లలకు అప్‌డేట్ చేయడం, బయోమెట్రిక్ వంటి సేవలు అందక ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రతీ పనికి ఆధార్ కార్డు తప్పనిసరి కాగా ఆధార్ కార్డు పొందడానికి వీలు లేకుండా పోవడంతో దూర ప్రాంతాలకు వెళ్తూ వ్యయ, ప్రయాసలకు లోనవుతున్నారు.

ఈ విషయమై కథలాపూర్ తహసీల్దార్ వినోద్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా కార్యాలయం వద్ద వాహనాలు, జనాల రద్దీ ఎక్కువగా ఉంటున్న దృష్ట్యా కొంత దూరంలో షెడ్ ఏర్పాటు చేసుకుని కేంద్రం నిర్వహించుకోవాలని నిర్వాహకుడికి సూచించామని చెప్పారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి అరుణ్ కుమార్

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగితే మంచి ఉద్యోగాలు సాధించవచ్చని జూనియర్ సివిల్ జడ్జి నారం అరుణ్ కుమార్ అన్నారు. శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఆరపేటలోని సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకి ముఖ్య అతిధిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఉన్నత శిఖరాల్ని అధిరోహించడానికి బాల్యం నుండే చదువుపై దృష్టి పెట్టి ఒక లక్ష్యం సాధించడానికి కృషి చేయాలని అన్నారు. ఇప్పుడు మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు ఉన్నాయని, వారు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. స్కూల్‌లో, ఇంటి వద్ద ఎవరైనా అసభ్యకరంగా మాట్లాడినా, ప్రవర్తించినా మౌనం వహించకుండా టీచర్స్, పేరెంట్స్ ద్వారా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. అనంతరం బాలికలకు పోక్సో, ఇతర చట్టాల గూర్చి సీఐ అనిల్ కుమార్, ఎస్సై కిరణ్ కుమార్‌లు అవగాహన కల్పించారు. అనంతరం జడ్జి అరుణ్ కుమార్ పాఠశాలలోని తరగతి గదుల్ని, వంట గదిని, స్టోర్ రూమ్‌ను పరిశీలించి విద్యార్థులకు నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంతి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తోగిటి రాజశేఖర్, ప్రిన్సిపాల్ డి. మాధురి, న్యాయవాదులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా ర్యాలీ



నినాదాలు చేస్తున్న బీసీ కులస్థులు

రాయికల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా మండలంలోని అల్లీపూర్ గ్రామంలో శనివారం బీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

ధర్మపురి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన శనిగరపు అశోక్ కుటుంబానికి మిత్ర యూత్ (1998-99 ఎస్ఎస్‌సీ మిత్ర బృందం) శనివారం రూ.16000 ఆర్థికసాయం అందించారు.

ఇసుకను తరలిస్తున్న వాహనాలు సీజ్

● ఇద్దరి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం పదిర, బండలింగంపల్లి గ్రామాల శివారులోని మానేరు వాగునుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు వాహనాలను సీజ్ చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి శనివారం తెలిపారు. మండలంలోని పదిర, సిద్ధిపేట జిల్లా దుబ్బాక గ్రామాలకు చెందిన రవాణాదారులు బొడ్డు మధు, మడవేని రాజులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. పదిర, బండలింగంపల్లి గ్రామాల శివారులోని మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా రాజు ట్రాక్టర్, మధు ట్రాలీఆటోల్లో ఇసుకను రవాణా చేస్తున్నక్రమంలో పట్టుకున్నామని చెప్పారు. వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి కేసులు నమోదు చేశామని వెల్లడించారు. రాజు, మధును న్యాయస్థానంలో హాజరుపర్చగా న్యాయమూర్తి 14రోజుల పాటు రిమాండ్‌కు పంపించారన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైమ్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ రూరల్ మండంలోని చేగుర్తి వాగు నుంచి సామనపల్లి బాబు ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.

చిన్నారుల మానసిక, శారీరక వికాసానికి, పూర్వ ప్రాథమిక విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఒక పూట సంపూర్ణ భోజనం అందించడమే కాకుండా.. వారిలో తలెత్తే పోషకాహార లోపాన్ని పారదోలేందుకు కృషి చేస్తోంది. ఇందుకోసం సిబ్బంది 'పంచ సూత్రాలు' అమలు చేస్తున్నారు. అధికారులు ప్రస్తుతం ఈ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించారు.

- గణేశ్‌నగర్ (ఆంధ్రజ్యోతి)



చిన్నారుల ఎదుగుదలకు పంచ సూత్రాలు

అంగన్‌వాడీల్లో ప్రత్యేక కార్యాచరణ అమలు

1 పూర్వ ప్రాథమిక విద్యా బోధన

జిల్లాలో 777 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో ఆరు నెలల నుంచి ఆరేళ్ల వయసు గల చిన్నారులు 32,914 మంది ఉన్నారు. వీరందరూ ప్రతిరోజు పౌష్టికాహారం పొందుతున్నారు. ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యను సిబ్బంది నేర్పిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు సైతం.. పౌష్టికాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతను వివరిస్తున్నారు. అప్పుడే పుట్టే బిడ్డలు, నవజాత శిశువులు ఆరోగ్యంగా ఉంటారని సూచిస్తున్నారు.

2 పౌష్టికాహారం...

చిన్నారుల్లో తలెత్తే అనారోగ్య సమస్యలు, ఎదుగుదలలో లోపాలు పోషకాహార లేమి వల్లే వస్తున్నాయి. బాల్యంలో సరైన ఆహారాన్ని అందించక పోతే ఎదురయ్యే ఇబ్బందులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. పిల్లల కోసం ఇళ్లలోనే స్వయంగా బలవర్ధక ఆహారాన్ని ఎలా తయారు చేయాలో ప్రదర్శనల్లో తెలియచెబుతున్నారు. పల్లి పట్టీలు, నువ్వుల లడ్డూలు, రాగి జావ వంటివి తినిపించాలని సూచిస్తున్నారు.

3 రక్తహీనత నివారణ...

పేదరికంతో సరైన పౌష్టికాహారం తినిపించక పోవడం వల్ల చిన్నారుల్లో రక్తహీనత, తీవ్ర పోషణ లోపం తలెత్తుతోందని గుర్తించారు. ఈ సమస్య ఎదుర్కొంటున్న చిన్నారులకు అదనంగా పౌష్టికాహారం అందిస్తున్నారు. బాలామృతం ప్లస్ ఇస్తున్నారు. వీటివల్ల పిల్లల ఎదుగుదల మెరుగుపడడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారు.

4 శుభ్రతకు ప్రాధాన్యం

చేతి వేళ్లు నోట్లో పెట్టుకోవడం, అపరిశుభ్రత కారణంగా చిన్నారులు తరచూ వ్యాధుల బారినపడుతున్నారు. శుభ్రత పాటించేలా కేంద్రాల్లో ప్రత్యేక పాఠాన్ని బోధిస్తున్నారు. చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలి? దీనివల్ల కలిగే ప్రయోజనాలను పాట రూపంలో బాలలకు వివరిస్తున్నారు. తల్లి దండ్రులకు ఈ అంశం గురించి తెలియజేస్తున్నారు.

5 వెయ్యి రోజుల ప్రణాళిక...

జిల్లాలో పోషణ లోపం గల చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. గర్భిణిగా ఉన్న సమయం నుంచి పుట్టిన బిడ్డకు రెండేళ్లు వచ్చే వరకు, అంటే వెయ్యి రోజుల పాటు దీన్ని కొనసాగిస్తున్నారు. అంగన్‌వాడీల్లో పౌష్టికాహారాన్ని అందిస్తూ, ఆరోగ్య సంరక్షణకు సూచనలిస్తున్నారు.

అంతర్రాష్ట్ర సైబర్ నేరస్థుడి అరెస్ట్

● సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి



సైబర్ నేరస్థుడి అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ చంద్ర శేఖర్ రెడ్డి

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): క్రెడిట్‌కార్డు యాక్టివేషన్ పేరుతో వాట్సా్‌పకు ఏపీకే లింక్ షేర్ చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముఠాలోని హైదరాబాద్ బోయిన్‌పల్లికి చెందిన అబ్దుల్ రషీద్‌ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సిరిసిల్ల డీఎస్పీ కె చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. డీఎస్పీ తెలిపినవివరాల ప్రకారం.. ఈ సైబర్‌ముఠాలో నిందితులైన హైదరాబాద్‌కు చెందిన మహ్మద్‌ఖలీం, జార్కండ్‌కు చెందిన అంకిత్ కుమార్‌ను ఇటీవలే అరెస్టు చేశామన్నారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన సురేష్‌కుమార్ అనేవ్యక్తి ఈసైబర్‌నేరస్థుల చేతిలో మోసపోయాడని, అతడి ఫిర్యాదు మేరకు సిరిసిల్లలో సైబర్‌ముఠాపై కేసు నమోదైందన్నారు. అంతర్‌రాష్ట్ర సైబర్ నిందుతుడిని పట్టుకోవడంలో కృషి చేసిన సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ బృందాన్ని ప్రత్యేకంగా డీఎస్పీ అభినందించారు.

టెక్స్ టైల్ పార్కులో అగ్ని ప్రమాదం

తంగళ్లపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి టెక్స్‌టైల్స్ పార్కులో శనివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. టెక్స్‌టైల్స్ పార్కులోని కళ్యాడపు సుభాష్‌కు చెందిన పరిశ్రమలో షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అక్కడేఉన్న కార్మికులు గమనించి మంటలను ఆర్పివేశారు. అగ్నిమాపకశాఖకు సమాచారం అందడంతో వెంటనే అక్కడికి చేరుకొని మంటలు వ్యాప్తిచెందకుండా చర్యలను చేపట్టారు. పోలీసులు ప్రమాదపరిస్థితి పర్యవేక్షించారు. సూమారు రూ.20వేల వరకు ఆస్తి నష్టం వాటినట్లు యజమాని సుభాష్ తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

● అప్పుల బాధతో పురుగుల మందు తాగిన వైనం



శ్రీనివాస్(ఫైల్)

సైదాపూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని గుజ్జులపల్లి గ్రామానికిచెందిన పూదరి శ్రీనివాస్(40) అనేరైతు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ తనకున్న మూడెకరాల భూమితోపాటు మరో రెండుఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుం టున్నాడు. రెండు మూడేళ్లుగా వేసిన పత్తి, మక్క, వరిపంట దిగు బడులు సక్రమంగా రాక అప్పు రూ.10లక్షలకు పైగా పెరిగిపోయింది. అప్పులు పెరిగాయనే మనస్థాపంతో శ్రీనివాస్ ఈనెల 9న తన వ్యవసాయ బావివద్ద పురుగుల మందు తాగాడు. గమనిం చిన తోటి రైతులు కుటుంబసభ్యులకు ఫోన్‌ద్వారా తెలియజేసి శ్రీనివాస్‌ను హుజూరాబాద్ ప్రభుత్వఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం జమ్మికుంటలోని ఓ ప్రైవేటు ఆస్ప త్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో అక్కడినుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వారు తెలిపారు. మృతుడు శ్రీనివాస్ భార్య శ్రీమతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో ముగ్గురి బలవన్మరణం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ముగ్గురు యువకులు వివిధ కారణాలతో బలవన్మరణం చెందారు. వివరాల్లోకి వెళితే..

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

శంకరపట్నం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం ముత్తారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక మద్యానికి బానిసై గడ్డిమందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన కనకం రవి(43) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. అప్పు తీసుకున్న దగ్గర వాయిదాలు కట్టలేక మనస్థాపానికి గురై ఈనెల2న గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే రవిని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతుడు రవి భార్య కనకం స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడు..



సునీల్(ఫైల్)

మల్యాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం బల్వం తాపూర్‌కు చెందిన తైదల సునీల్(23) అనే యువకుడు శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. సునీల్ డీజే ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం వేకువజామున పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకోవడంతో తండ్రి లక్ష్మీరాజం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి సెల్‌ఫోన్ కాల్‌డాటా పరిశీలించగా ఓ మహిళ సెల్‌ఫోన్ నుంచి పలుమార్లు ఫోన్‌కాల్స్ ఉన్నాయని, తన కుమారుడి మృతికి సదరు మహిళే కారణమంటూ సునీల్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యానికి బానిసై ఒకరు..

కరీంనగర్ క్రైమ్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం చెర్లబూత్కూర్ గ్రామంలో చెందిన తుమ్మ అజయ్ కుమార్ (34) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. భార్యనుంచి విడాకులు తీసుకొని, ఇంటివద్దనే ఉంటూ మద్యానికి బానిసయ్యాడని, జీవితంపై విరక్తిచెంది శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకున్నాడని పేర్కొన్నారు. అజయ్‌కుమార్ తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఈతకు వెళ్లి వ్యక్తి మృతి



రాజు(ఫైల్)

తంగళ్లపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మానేరు వాగులో ఈతకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన తంగళ్లపల్లి మండలం కస్బేకట్కూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన లాల రాజు(45) అనేవ్యక్తి ఉదయం 11 గంటల ప్రాంతంలో గ్రామశివారులో మానేరు వాగులోని చెక్‌డ్యామ్ వద్దకు సరదాగా ఈతకు కొట్టేందుకు వేళ్లగా ప్నమాదవశాత్తు గల్లంతయ్యాడు. రాజు చాలా సేపయినా నీటీలోనుంచి బయటకు రాకపోవడంతో అనుమానించిన గ్రామస్థులు గాలింపు చేపట్టగా శవమై కనిపించాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య రజిత, కొడుకులు వేణు, విష్ణు ఉన్నారు.

యువకుడి హత్యకేసులో నిందితుల అరెస్ట్

● హత్యకు ఉపయోగించిన మారణాయుధాలు, బైక్‌ల స్వాధీనం ● రిమాండ్‌కు తరలింపు

రామగిరి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీలో సంచలనం సృష్టించిన యువకుడి హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణంలోని సీటూ 200 క్వార్టర్‌లోని మహిళా సమాఖ్య కార్యాలయం ఎదుట న్యూమారేడుపాక పోతనకాలనీకి చెందిన కోట చిరంజీవి(36)అనేవ్యక్తి దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే. శనివారం ఉదయం పెంచికల్‌పేట్ ఎక్స్‌రోడ్‌వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఏసీపీ రమేష్ తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ హత్యకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మృతుడు చిరంజీవి పోతన కాలనీలో మీ సేవా సెంటర్ నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. సంధ్యారాణి మీసేవకు వెళ్లినప్పుడు చిరంజీవిని కలిసింది. అప్పటినుంచి చిరంజీవి ఆమెతో మాట్లాడుతూ మెసేజ్ చేసేవాడు. నువ్వు అంటే ఇష్టమని నీతో ఉంటానని చెబుతూ ఒప్పుకోకపోతే చంపుతానని బెదిరింపులకు గురి చేశాడని, దీంతో నిందితురాలు భయపడి అతనితో తరుచూ మాట్లాడేదని పేర్కొన్నారు. కొంతకాలం తర్వాత చిరంజీవితో దూరంగా ఉంటూ మాట్లాడకపోవడంతో నిందితురాలితోపాటు భర్తను చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. వేధింపులు భరించకలేక భర్తకు తెలుపగా నెలరోజుల క్రితం గ్రామంలో పంచాయతీ నిర్వహించినా చిరంజీవిలో మార్పురాలేదు. పంచాయతీ పెట్టిస్తావా అంటూ వేధింపులు ఎక్కువ చేసినట్లు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం సెంటినరీకాలనీలోని మహిళా సమాఖ్య కార్యాలయం వద్దకు వచ్చిన చిరంజీవి సంధ్యారాణితో గొడవకు దిగాడు. దీంతో ఆమె భర్తకు సమాచారం అందించింది. దీంతో భర్త పొలవేన కుమార్‌తోపాటు సంధ్యారాణి తండ్రి అనవేన మల్లయ్య, సోదరుడు అనవేన నరేష్, బంధువు పిడుగు చందు మహిళా కార్యాలయం వద్దకు చేరుకున్నారు. చిరంజీవిని బయటకు తీసుకువచ్చి చంపాలనే ఉద్దేశ్యంతో సోదరుడు, బంధువు చిరంజీవిని పట్టుకోగా నిందితురాలి తండ్రి ఇనుపరాడు, కత్తితో తలపై బలంగా కొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందాడు.



నిందితులను అరెస్ట్ చూపిస్తున్న పోలీసులు

హత్య కేసులో ఐదుగురు నిందితులతోపాటు హత్యకు ఉపయోగించిన మూడు బైక్‌లు, వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో మంథని, గోదావరిఖని సీఐ రాజు, ప్రసాద్‌రావు, రామగిరి, ముత్తారం ఎస్ఐలు శ్రీనివాస్, ప్రసాద్, దివ్య పాల్గొన్నారు.

కాచాపూర్‌లో కొండచిలువ కలకలం

శంకరపట్నం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాచాపూర్‌లో శుక్రవారం అర్ధరాత్రి రోడ్డుపైకి కొండచిలువ రావడంతో కాలనీవాసులు ఆందోళనకు గురయ్యారు. కాచాపూర్ గ్రామంలోని కుమ్మరివాడలో సీసీరోడ్డుపై కొండచిలువ గమనించిన ఓ యువకుడు చుట్టుపక్కల వాళ్లను అప్రమత్తం చేశాడు. అనంతరం అది పక్కనే ఉన్న పొలాల్లోకి వెళ్లిపోయింది.

స్వగ్రామం చేరిన మృతదేహం

గంభీరావుపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్‌కు చెందిన దోమకొండ శ్రీకాంత్(26) ఈనెల7న గల్ఫ్‌లో మృతిచెందగా శనివారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. 6 నెలలక్రితం బతుకు దెరువు కోసం శ్రీకాంత్ దుబాయి వెళ్లాడు. ఈనెల4న జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాంత్ తీవ్రంగా గాయపడగా, చికిత్సపొందుతూ 7న మృతిచెందాడు. 5రోజుల తరువాత శ్రీకాంత్ మృతదేహం స్వగ్రామం ముస్తాఫనగర్‌కు చేరడంతో వారి బంధువుల రోదనలు మిన్నంటాయి.

ప్రమాదవశాత్తు నీట మునిగి వాటర్‌మెన్ మృతి

గంభీరావుపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వెంకటాద్రి చెరువులో శనివారం నీట మునిగి పంచాయతీ వాటర్‌మెన్(మల్టీపర్పస్‌వర్కర్) తుమ్మల రమేష్(43) మృతిచెందాడు. వెంకటాద్రి చెరువులో కింది భాగంలోఉన్న మంచినీళ్ల బావివద్దకు వెళుతుండగా, రమేష్ నీటమునిగి మృతిచెందాడు. పోలీస్‌లు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రమేష్ పదేళ్లుగా గ్రామపంచాయతీలో మంచినీటి సరఫ రాకు సంబంధించి మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. మంచినీళ్ల బావివద్ద ఉన్న మోటర్ ఇటీవల కాలిపోయింది. ఈయేడు వర్షాలు సమృద్ధిగా కురవడంతో మంచినీళ్ల బావి చెరువులో మునిగిపోయింది. దీంతో తెప్ప సహాయంతో శుక్రవారం మంచినీళ్ల బావి వద్దకు వెళ్లి మోటర్‌ను రిపేర్ చేసి తిరిగి బిగించి వచ్చారు.

మరుసటిరోజు శనివారం మంచినీళ్లు రాకపోవడంతో గ్రామపంచా యతీ ఫిట్టర్ నవాబ్, వాటర్‌మెన్ రమేష్ తెప్పపై మంచినీళ్ల బావి వద్దకు బయ ల్దేరారు. మధ్యలో రమేష్ ఉన్నట్టుండి తెప్పనుంచి జారినీట మునిగిపోయాడు. గమ నించిన ఫిట్టర్ కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. రమేష్ నీటమునిగి మృతి చెందాడు. గజ ఈతగాళ్ల సహాయంతో రమేష్ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. ఇదిలా ఉండగా విద్యుత్‌షాక్ తగిలి రమేష్ మృతిచెంది ఉండవచ్చనే అను మానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం సిరిసిల్లఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు ఉన్నారు.

గురుకుల కళాశాలలో విద్యార్థికి పాముకాటు

సుల్తానాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణశివారులోని సాంఘిక సంక్షేమశాఖ బాలురగురుకుల కళాశాలలో ఓ విద్యార్థిని పాము కాటువేసిన ఉదంతం చోటుచేసుకుంది. శుక్రవారంరాత్రి విద్యార్థులు భోజనాలు చేసిన అనంతరం ఆడుకుంటుండగా ఇంటర్ మొదటిసంవత్సరం విద్యార్థి చందన్‌చరణ్ మూత్రవిసర్జనకు వెళ్లగా అతడిని పాటు కాటువేసినట్లుగా గుర్తించారు. విద్యార్థి వెంటనే కళాశాల అధ్యాపకులుగా తెలుపగా సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం విద్యార్థి చందన్‌ను మెరుగైన చికిత్సకోసం కరీంనగర్ తరలించారు. విద్యార్థికి ఎలాంటి ప్రాణా పాయం లేదని డాక్టర్లు వివరించారు. వెంటనే బాధిత విద్యార్థి తల్లితండ్రులను పిలిపించి విషయాన్ని వారికితెలిపారు. విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉండడంతో తల్లిదండ్రులకు విద్యార్థిని అప్పగించినట్లు తెలిసింది.

గోదావరిలో స్నానం చేస్తే సర్వపాపాలు తొలగిపోతాయి

● నవ నారసింహ క్షేత్రాల్లో ధర్మపురి ఒకటి ● ఆధ్యాత్మిక వేత్త, ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర్‌రావు

ధర్మపురి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గోదావరిలో స్నానం ఆచరిస్తే సర్వ పాపాలు తొలగి పునీతులవుతారని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచన కర్త చాగంటి కోటేశ్వర్‌రావు అన్నారు. ధర్మపురి క్షేత్రంలోశ్రీ మఠం స్థలంలో నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమంలో శనివారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వర్‌రావు భక్తులను ద్దేశించి ప్రవచనాలు చేశారు. అనంతరం చాగంటి కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ నవనారసింహ క్షేత్రాల్లో ధర్మపురి ఒకటన్నారు. ధర్మపురి పుణ్యక్షేత్రానికి చాలా ప్రాశస్త్యం ఉందని ఆయన తెలిపారు. గోదావరి నది ఆరంభం నుంచి సముద్ర తీరంలో కలిసే వరకు నదీ తీరాన గల గ్రామాలకు ఎంతో పవిత్రత ఉందన్నారు.



ధర్మపురిలో ప్రవచనాలు చేస్తున్న ఆధ్యాత్మిక వేత్త, ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర్‌రావు

ధర్మపురి క్షేత్రం ఎంతో గొప్పదని తెలిపారు. ధర్మపురి పుణ్యక్షేత్రంలో మొట్ట మొదటి మెట్టు మీద కాలు పెడితే సకల విజయాలు చేకూరుతాయన్నారు. ధర్మపురి క్షేత్రాన్ని దర్శిస్తే యమపురి ఉండదని ఆయన తెలిపారు. ఇక్కడ యమ ధర్మరాజును దర్శిస్తే పుణ్య ప్రాప్తి కలుగుతుందన్నారు. ధర్మపురి క్షేత్ర మహత్యం, శేషప్ప కవి గురించి ఆయన ప్రస్తావించారు. నరసింహ శతకంలోని పద్యాలు స్వీకరిస్తే ఎంతో సంతృప్తి కలుగుతుందని ఆయన అన్నారు. రెండు గంటల పాటు చాగంటి కోటేశ్వర్‌రావు ప్రసంగించారు. అంతకు ముందు చాగంటి కోటేశ్వర్‌రావును రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీవో మదుసూదన్, టీపీసీసీ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ మాళ్ల శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, పట్టణ అధ్యక్షుడు, చీపిరిశెట్టి రాజేష్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగిత్యాల డీఎస్పీ వెంకటరమణ పర్యవేక్షణలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు, నాయకులు

రియల్టర్ హత్య కేసులో ప్రధాన నిందితుడి అరెస్ట్

వేములవాడ క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రియల్టర్ సిరిగిరి రమేష్ హత్యకేసులో ప్రధాన నిందితుడైన వేములవాడ అర్బన్ పరిధిలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన చిర్రం రవిని శనివారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు అడిషనల్ ఎస్పీ శేషాద్రినిరెడ్డి తెలిపారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులైన ఎద్దండి వెంకటేష్, అలా వంశీలను సెప్టెంబరు 23న రిమాండ్‌కు తరలించామన్నారు. సెప్టెంబరు 19న సిరిసిల్ల పట్టణం పెద్దూరు వద్ద కారు ఆపేసి సిరిసిల్ల పట్టణం అంబేద్కర్‌నగర్‌కు చెందిన మాజీకౌన్సిలర్, రియల్టర్ సిరిగిరి రమేష్‌ను హత్య చేసి వేములవాడ నంది కమాన్ వద్దగల నందీశ్వరటౌన్‌షిప్ వెంచర్‌లో కారులోనే మృతదేహాన్ని వదిలేసి వెళ్లారన్నారు. కేసు ఛేదనలో కృషి చేసిన టౌన్ ఏస్ఐ రామ్మోహన్ బృందాన్ని ఆమె అభినందించి రివార్డు ప్రకటించారు.



రవిని అరెస్ట్‌ను చూపుతున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

ఇసుక లారీ పట్టివేత

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో ఇసుక లారీ సీజ్‌చేశారు. శుక్రవారం రాత్రి సిరిసిల్ల పట్టణంలోని రగుడు గ్రామశివారులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా సరైన అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఒక లారీని పట్టుకున్నారు. లారీ హన్మకొండకు చెందినదిగా గుర్తించారు. లారీని సీజ్‌చేసి, డ్రైవర్ కంది అంజన్నను తదుపరి చట్టపరమైన చర్యల కోసం సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరించారు.

విద్యుత్ సిబ్బంది సాహసం

● చెరువులో ఈదుకుంటూ వెళ్లి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

జగిత్యాల రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం చెరువులో శనివారం విద్యుత్ సిబ్బంది ఈదుకుంటూ వెళ్లి మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. రెండు రోజుల క్రితం విద్యుత్‌పోల్ ఇన్సులేటర్ చెడిపోవడంతో పొలాలకు విద్యుత్‌సరఫరా నిలిచిపోయింది. రైతులు ఈ సమస్యను లైన్‌మన్ దృష్టికి రైతులు తీసుకెళ్లారు. ఆయన మరమ్మతులకోసం సిబ్బందినారాయణ, మునిని పంపించారు. ఇద్దరు ఈదుకుంటూ చెరువులో ఉన్న స్తంభంవద్దకు వెళ్లి ఇన్సులేటర్‌ను సరిచేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. చెరువులో ఈదు కుంటూ వెళ్లి విద్యుత్‌ను పునరుద్ధరించిన అసిస్టెంట్ లైన్‌మన్ నారాయణ, హెల్పర్ మునిని గ్రామస్థులు, రైతులు అభినందించారు.



విద్యుత్‌స్తంభం వద్ద మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది నారాయణ, ముని

రైతు ఆదాయం పెంచేందుకు కిసాన్ గ్రామీణ మేళా

- డిసెంబరు 1 నుంచి నిర్వహణ
- కిసాన్ జాగరణ్ అధ్యక్షుడు పి సుగుణాకర్‌రావు



మాట్లాడుతున్న బీజేపీ నేత పోల్సాని సుగుణాకర్‌రావు

కరీంనగర్ టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులకు సాగులో శాస్త్రీయ, ఆధునిక పద్ధతుల గురించి తెలియజేయడానికి కరీంనగర్ జిల్లా కేంద్రంలో కిసాన్ గ్రామీణమేళాను నిర్వహిస్తున్నట్లు రైతు చైతన్య వేదిక కిసాన్ జాగరణ్ అధ్యక్షుడు పి సుగుణాకర్‌రావు తెలి పారు. శని వారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ 2022, 2023లో కరీంనగర్‌లో కిసాన్ గ్రామీణమేళాను కిసాన్ జాగరణ్ ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. దానికి రైతులు, ఉత్పత్తిదారులు, పారిశ్రామిక వేత్తలు, శాస్త్రవేత్తల నుంచి అపూర్వ స్పందన లభించిందని తెలిపారు. ఈసంవత్సరం డిసెంబరు 1,2,3తేదీల్లో కరీంనగర్ అంబేద్కర్ స్టేడి యంలో నిర్వహించే ఈమేళాకు కేంద్ర, రాష్ట్రమంత్రులను, ప్రజాప్రతి నిధులను, అధికారులు, ఆదర్శ రైతులను భాగస్వాములుగా చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు రైతులకు చేర్చేవిధంగా ఈమేళా ఉంటుం దని అన్నారు. రైతులకు కావలసిన యంత్రాలు, పనిముట్లు, విత్తనాలను ఈ మేళాలో డీలర్ ధరలకే విక్రయిస్తామని కొన్ని కంపెనీలు ప్రకటిం చాయన్నారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, మెదక్, నిజా మాబాద్ జిల్లాల రైతులు పాల్గొనేలా విస్తృత ప్రచారం నిర్వహిస్తామని చెప్పారు. నవ నిర్మాణ ఫౌండేషన్ అధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ రైతులకు, గ్రామీణ ప్రజలకు లాభం చేకూర్చే విధంగా కిసాన్ గ్రామీణ మేళా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా కిసాన్ గ్రామీణ మేళా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో నవనిర్మాణ ఫౌండేషన్ సభ్యు లు సాయి జ్యోతి, గంప జగన్, దుర్గం మారుతి, మొలుగూరి కిశోర్, జేడీ భగవాన్, తాడూరి బ్రహ్మం, కూరగాయల తిరుపతి, మిరియాల్ కార్ ఆనంద్, నగునూరి లక్ష్మణ్, నర్సింహారెడ్డి, సత్యనారాయణరావు, కుమార్, బ్రిడ్జ్ మోహన్ రాథోడ్, స్వామి, బాషబోయిన ప్రదీప్ పాల్గొన్నారు.



పద్మనగర్ మూలమలుపు వద్ద బస్సు, లారీ ఢీ(ఫైల్)



నేరెళ్ల గ్రామంలో ఉన్న ప్రమాదకరమైన మూలమలుపులు

- సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారిలో 9 డేంజర్ జోన్లు
- తరచూ ప్రమాదాలు.. గాల్లో కలుస్తున్న ప్రాణాలు

మూల మలుపులు మృత్యు పిలుపులు

తంగళ్లపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారిలో ఉన్న మూల మలు పులు ప్రమాదకంగా మారాయి. ఈ రహదారిలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో వాహనదారుల ప్రాణాలు అరచేతిలో పెట్టు కొని వెళ్లాల్సి వస్తోంది. తంగళ్లపల్లి మండల కేంద్రం నుంచి జిల్లా సరిహద్దు వరకు తొమ్మిది ప్రమాద కరమైన మూలమలుపులు ఉన్నాయి. అతి ప్రమాద కరంగా మండల కేంద్రంలో, నేరెళ్ల గ్రామంలో, జిల్లెల్ల శివారులో మూలమలుపులున్నాయి. కాగా ఈ మూలమలుపుల వద్ద సంబంధిత అధికారులు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోకపో వడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. జిల్లెల్ల గ్రామ శివారులో, జిల్లా సరిహద్దులో ఉన్న మూల మలుపుల్లో నిత్యం ప్రమాదాలు సంభవిస్తూ ఇప్పటికే మూలమలుపు వద్ద పలువురి ప్రాణాలు గాలిలో కలిశాయి. నేరెళ్ల గ్రామంలో, శివారులో అతి ప్రమాదకరమైన రెండు మూలమలుపులుండగా ఇక్కడ కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. గతం లో ఈ మూలమలుపులో ఓ లారీ ఇంటిలోకి దూసు కెళ్లి మహిళ మృతిచెందింది. శివారులోని మూల మలుపు వద్ద ఆర్టీసీ బస్సు రోడ్డు దిగి పొలాల్లోకి దూసుకువెళ్లడంతో పలువురు ప్రయాణికులు గాయ పడ్డారు. నెల క్రితం పద్మనగర్ శివారులోని మూల మలుపు వద్ద బస్సు, లారీ ఢీకొనడంతో పలువురు గాయపడ్డారు.

మూల మలుపులు తొలగించాలి..

\- కందికట్ల సాయి, డ్రైవర్, తంగళ్లపల్లి



ప్రమాదకరంగా ఉన్న నేరెళ్ల, తంగళ్లపల్లి గ్రామాల వద్ద ఉన్న మూల మలుపులు తొలగించాలి. మలుపులు తొలగించి సరిగ్గా ఏర్పాటు చేసి ప్రమాదాలు నివరించాలి. ఈ రోడ్డు గుండా వాహనం నడపాలంటేనే భయమేస్తోంది.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం..

\- ఉపేంద్రచారి, ఎస్‌ఐ తంగళ్లపల్లి



ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ నుంచి చర్యలు తీసుకుంటున్నాం. ప్రమాదాలు జరగకుండా అవసరం ఉన్న చోట బారికేడ్లు ఏర్పాటు చేశాం. వాహనాల తనిఖీ చేస్తున్నాం. డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేస్తున్నాం. కొన్నిచోట్ల రేడియం స్టిక్కర్లతో ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేశా

ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం..

సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారిపై ఉన్న మూల మలుపుల వద్ద ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపి స్తు న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అత్యం త ప్రమాదకరమైన మూలమలుపులను గుర్తించి కనీ సం స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

మల్యాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలకేంద్రానికి చెందిన తాడూరి అనిల్, సామల రవి పరస్పరం దాడి చేసుకున్న ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలి పారు. అనిల్, రవి మధ్య కొంతకాలంగా మనస్పర్థలు ఉన్నాయని, శుక్రవారం రాత్రి అనిల్ ఇంటి వద్ద ఇరువురికి గొడవ జరిగి పరస్పరం దాడి చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో ఇద్దరికి గాయాలు కాగా ఇరు వురి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనిల్, రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

వదినపై దాడి సంఘటనలో మరిదిపై కేసు నమోదు

చందుర్తి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వదినపై దాడి చేసిన సంఘటనలో మరిదిపై కేసు నమోదు చేసినట్లు చందుర్తి ఎస్సై రమేష్ శనివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంకు చెందిన కొటె అనిల్ తన తల్లితో వదిన గొడవ పడుతోందని వైపర్ కర్రతో దాడి చేశాడు. దీంతో వదిన ఇచ్చిన ఫిర్యాదు మేరకు మరిది కోటి అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైమ్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్ శివారులోని ఓ ఫంక్షన్‌హాలు వద్ద పేకాట శిబిరంపై శనివారం సాయంత్రం కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాటఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 66 వేల రూపాయల నగదు, ఒక కారు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు. కేసు విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైతుల పక్షపాతి ప్రధాని నరేంద్రమోదీ

- రైతుల జీవితాల్లో వెలుగులు నింపేందుకే ధన్‌ధాన్య కృషియోజన
- కరీంనగర్ డెయిరీకి సంపూర్ణ సహకారాన్ని అందిస్తా
- డెయిరీ పెరుగు కేంద్రాన్ని ప్రారంభించిన కేంద్రమంత్రి 'బండి'

కరీంనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రైతుల పక్షపాతి అని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయమార్కెట్‌లో యూరియా ధరలు ఆకాశాన్ని అంటుతున్న సమయంలో ధరలను పెంచకుండా ఆ మొత్తాన్ని కేంద్రమే భరిస్తూసబ్సిడీ ధరకే యూరియాను అందిస్తోందని అన్నారు. దేశంలోని 1.7కోట్లమంది రైతుల జీవితాల్లో వెలుగులు నింపేం దుకు యేటా రూ.24వేల కోట్ల నిధులతో ధన్‌ధాన్యకృషి యోజన పథ కాన్ని నేటినుంచి అమలుచేయడం శుభపరిణామమని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ శనివారం ఢిల్లీలో వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించి రూ.42వేలకోట్ల విలువైన అనేకప్రాజెక్టులను ప్రారంభిం చారు. దీనితోపాటు పీఎం ధనధాన్య కృషియోజన పథకాన్ని ప్రారంభిం చారు. ఈ కార్యక్రమాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్



తిమ్మాపూర్ మండలం నల్లగొండలోని కరీంనగర్ డెయిరీప్లాంట్ వద్ద జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్

జిల్లాలోని తిమ్మాపూర్ మండలం నల్లగొండ గ్రామంలో కరీంనగర్ పాల డెయిరీప్లాంట్ వద్ద వీక్షించారు. అనంతరం కేంద్రం, జపాన్ ఇంటర్నేష నల్ సంస్థ జికా ఆర్థిక సహకారంతో రూ.90కోట్ల 70లక్షలకుపైగా నిధులతో నిర్మించిన ఆటోమెటిక్ కర్డ్ ప్లాంట్‌ను కేంద్రమంత్రి సంజయ్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ దేశంలోని 100జిల్లాలను ఎంపికచేసి కోటి70 లక్షల మంది రైతులను అన్నివిధాలుగా ఆదుకొని లాభాలు కలిగించేం దుకు ఈపథకాన్ని అమలు చేయడం హర్షణీయమని అన్నారు. తెలం గాణలో గద్వాల్ నారాయణపేట, నాగర్‌కర్నూల్, జనగాంలో నేటినుంచి ఈ పథకం అమలులోకి వస్తుందని, యేటా 24వేల కోట్ల చొప్పున ఆరు సంవత్సరాలు నిధులను కేటాయిస్తారని చెప్పారు. కష్టపడి కరీంనగర్ డెయిరీని ఈ స్థాయికి చైర్మన్ రాజేశ్వర్‌రావు తీసుకువచ్చారని, అందుకే ఆయనకు డెయిరీ రాజేశ్వర్‌రావు పేరు వచ్చిందని అభినందిం చారు. కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ 600మందికి ప్రత్యక్షంగా, 5వేల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నదని, లక్షమంది పాడిరైతుల నుంచి పాలను కొనుగోలు చేసి వారి జీవితాలకుభరోసా ఇస్తున్న సంస్థ కరీంనగర్ డెయిరీ అని యాజమాన్యాన్ని అభినందించారు. కరీంనగర్ డెయిరీ పనితీరును పరిశీలించి మోదీ ప్రభుత్వం 2021లోనే 3లక్షల లీటర్ల పాల ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు సాయం



తిమ్మాపూర్ మండలం నల్లగొండలో కరీంనగర్ డెయిరీ పెరుగు కేంద్రాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

అందించిందని గుర్తుచేశారు. ఈరోజు ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజనలో భాగంగా ఎన్‌పీడీడీ, ఎఐఅండ్‌బీ, జికా ఆర్థిక సహకారంతో 90కోట్ల 70లక్షల 94వేలతో లక్షా 50వేల లీటర్ల పెరుగు కేంద్రం ఏర్పాటు చేయడం గొప్ప విషయమని అన్నారు. డెయిరీ ఆస్తులను గతంలో కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే తాను కార్పొరేటర్‌గా ఆనాడు డెయిరీ పక్షాన అనేక ఉద్యమాలు చేశానని, మాపై ఆనాడు ఎన్నో కేసులు పెట్టినా లెక్కచేయలేదని సంజయ్ చెప్పారు. మా కార్యకర్తలు ఉద్యమాలు చేసి డెయిరీకి అండగా నిలిచారని అన్నారు. కరీంనగర్ డెయిరీ ఉత్పత్తులను ఆపేందుకు ప్రభుత్వంలోని కొందరు ప్రయత్నిస్తున్నట్లు తనదృష్టికి వచ్చిందని, రాష్ట్ర ప్రభు త్వంతో మాట్లాడుతానని, డెయిరీ ఉత్పత్తులను ఆపొద్దని భరోసా ఇచ్చారు. మరింతగా విస్తరిస్తూ ప్రజలకు సేవలందిం చేలా చూడాలని చైర్మన్ రాజేశ్వర్‌రావును కోరుతూ అన్నివిధాలుగా డెయిరీ అభివృద్ధికి సహకరిస్తానని మంత్రి సంజయ్ హామీ ఇచ్చారు.

చేనేత మగ్గంపై.. వెండి పీతాంబరం

సిరిసిల్ల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ చేనేత మగ్గంపై పట్టు పీతాంబరం చీరను వినూ త్నంగా ఆవిష్కరించారు. చేనేత మగ్గంపై 60రోజుల పాటు శ్రమించి 362 గ్రాముల వెండిని ఉపయోగించి పట్టు పీతాంబరం చీరను హరిప్రసాద్ నేశాడు. 660 గ్రాములు బరువు ఉండే ఈ చీర దాదాపు రూ లక్ష వరకు ధర పలుకుతోంది. చీరలో బార్డర్ బూటా, మీనా పనులు చేతితో చేశారు. సిరిసిల్లకు చెందిన హరిప్రసాద్ చేనేత మగ్గంపై అనేక ఆవిష్కరణలు చేస్తున్నాడు. గతంలో అగ్గిపెట్టెలో అమరే చీర, దబ్బనంలో దూరే చీర, బంగారంతో పట్టు దారాలను ఉపయోగించి చీరలు నేశాడు.



వెండిపట్టు పీతాంబరంతో నేత కళాకారుడు హరిప్రసాద్

నిప్పంటించుకొని వ్యక్తి ఆత్మహత్య

వీణవంక, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన గడ్డం శ్రీధర్(52) జీవితంపై విరక్తి చెంది ఒంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీధర్ పది సంవత్సరాలుగా పక్ష వాతంతో బాధపడుతున్నాడు. శుక్రవారం భార్య ఇంట్లో లేని సమయంలో బయటికి వెళ్లాడు. మళ్లీ ఇంటికి రాకపోగా కుటుంబ సభ్యులు వెతికినా ఎక్కడ కనిపించ లేదు. శనివారం చల్లూరు లోని గుట్టబోరు బావి పొదలలో సగం కాలిపోయిన మృతదేహం కనిపించగా తన భర్త మృతదేహమని గుర్తించిన భార్య పోలీసు లకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

చెరువు కాదు.. మురుగు..

- మురికి నీటిలో మునిగి గ్రామస్థుడి నిరసన..

చిగురుమామిడి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): చిగురుమామిడి మండలం చిన్నముల్కనూర్ గ్రామానికి చెందిన వ్యక్తి వీధిలో నిలిచిన మురుగునీటిలో మునిగి వినూత్నంగా నిరసన తెలిపాడు. వివరాల్లోకి వెళితే.. చిన్నముల్కనూరు గ్రామంలోని దుర్గమ్మ గుడి వద్ద కొన్నిరోజులుగా మురుగునీరు నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకో వడం లేదు. విసిగివేసారిన గ్రామానికి చెందిన వంగల రవి అనేవ్యక్తి అధికారుల తీరుకు నిరసనగా శనివారం అదేమురికినీటిలో మునిగి నిరసన తెలియ జేశాడు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కొన్నిరోజులుగా తమ వీధిలో మురికినీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. మురుగునీటి నుంచి వచ్చే దుర్వాసనను భరించలేక పోతున్నాం. దోమలు వృద్ధి చెంది వ్యాధులు వస్తాయని ఆందోళన చెందున్నాం. ఈవిషయాన్ని అనేకసార్లు గ్రామపంచాయతీ సిబ్బందికి చెప్పినా పట్టించుకున్న నాథుడు లేడు. అధికారుల్లో చలనం రావాలని ఇలా మురుగునీటిలో మునిగినిరసన తెలిపాను. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని మురికినీటిని తొల గించాలి. లేనిపక్షంలో ఇదే మురికినీటిలో ఆత్మహత్య చేసుకుంటానని అన్నాడు. రవి తెలియజేసిన నిరసనకు కాలనీవాసులు పూర్తి మద్దతు పలికారు.



మురికి నీటిలో మునుగుతున్న వంగపల్లి రవి

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చొప్పదండి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): చొప్పదండిలోని హెచ్‌పీ పెట్రోలు పంపు సమీపంలో శనివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. కారు ఆటోను ఢీకొన్న ఘటనలో ఆటోలోని ముగ్గురికి గాయాలు అయ్యాయి. వెంటనే 108కు సమాచారాన్ని అందించగా సిబ్బంది క్షతగాత్రులను చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వారు మండలం లోని చిట్యాలపల్లి గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు.

రాజన్న, భీమన్న ఆశీస్సులతో లోక కల్యాణం..

- టెంపుల్ సిటీగా వేములవాడ అభివృద్ధి
- రాబోయే వంద ఏళ్లు భక్తులు ఇబ్బందులు లేకుండా చర్యలు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- భీమేశ్వర ఆలయంలో ఆర్జిత సేవలు ప్రారంభం



రాజన్న దర్శనానికి వస్తున్న ఆది శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న, భీమన్నల ఆశీస్సులతో లోకకల్యాణం జరగాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న ఆలయవిస్తరణ అభి వృద్ధిలో భాగంగా శనివారం ఉద యం ఆయన రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈవోతో కలిసి భీమన్న ఆల యంలో కోడెమొక్కును చెల్లించు కున్నారు. శ్రీభీమేశ్వర, శ్రీనగరేశ్వర స్వామి వారి ఆలయాల్లో ఏర్పాటు చేసిన పలు ఆర్జితసేవలను ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, ఈవో రమాదేవి, ఆర్డీవో రాధాబాయితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయా నికి వచ్చే భక్తులకు భీమేశ్వర ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రాజన్న ఆలయంలో జరుగుతున్న పనుల నేపథ్యంలో స్వామివారికి ఏకాంత సేవలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. రానున్న మరో వంద సంవత్సరాల వరకు భక్తులక ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఈనెల 19న శృంగేరి పీఠాధి పతి విధిశేఖర భారతిశర్మస్వామి వేములవాడకు రాను న్నారని, శ్రీస్వామి వారిని దర్శించుకుని పలు సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రతాప రామకృష్ణ, ఏఈవోలు శ్రవణ్‌కుమార్, అశోక్, శ్రీనివాస్, జయకుమారి కాంగ్రెస్ నాయకులు రొండి రాజు, కనికరపు రాకేష్, సంద్రగిరి శ్రీనివాస్, నిత్యానందరావు, నాగం కుమార్, పిల్లి కనుకయ్య, గాలిపెల్లి స్వామి, పాత సత్యలక్ష్మీ ఉన్నారు.

భీమేశ్వర స్వామివారి ఆలయంలో కోడెమొక్కు.

వేములవాడ భీమేశ్వర స్వామివారి ఆలయంలో శని వారం కోడెమొక్కులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వ హించి కోడెమొక్కులను ప్రారంభించారు.

భక్తుల దర్శనాలు నిలిపివేత..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయ విస్తరణ అభివృద్ధి పనుల్లో భాగంగా రాజన్న ఆలయంలో భక్తుల దర్శనాలను నిలిపివేసి భీమన్న ఆలయంలోకి మార్చుతు న్నట్లు ఆలయాధికారులు ఒక ప్రక టనలో వెల్లడించారు. రాజన్న ఆలయంలో నిర్వహించే కోడె మొక్కులు, అభిషేకము, పలురకాల పూజలను శ్రీ భీమేశ్వర ఆలయంలో జరుగు తాయన్నారు. రాజన్న ఆలయంలో ఆదివారం ఉదయంనుంచి దర్శనాలు ఉండవని అధికారులు పేర్కొన్నారు.

సందడిగా మారిన భీమన్న ఆలయం

వేములవాడ భీమేశ్వర ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధిలో భాగంగా సంప్రదాయం ప్రకారం శనివారం భీమన్న ఆల యంలో ఆర్జిత పూజల కార్యక్రమాలను ప్రభుత్వ విప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమన్న ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భీమన్న దర్శనం కోసం భక్తులు క్యూలైన్‌లో బారులుతీరారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయాధికారులు ఉచిత ప్రసాదాన్ని అందజేశారు.

నిత్యకల్యాణానికి పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు..

వేములవాడ రాజన్న ఆలయ కళాభవన్‌లో నిర్వహించే నిత్య కల్యాణాలను నిత్యాన్నదానసత్రం భవనం పైఅంతస్థు లోకి మార్చారు. ఈ సందర్భంగా శనివారం నిత్యకల్యాణానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై భక్తులతో మాట్లాడారు. భక్తులకు ఇబ్బం దులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులకు సూచించారు.



భీమన్న ఆలయంలో కోడె మొక్కులను ప్రారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్



భీమన్నను దర్శించుకుంటున్న భక్తులు

పోస్టర్ ఆవిష్కరణ

రాయికల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలో ఏర్పాటు చేసిన శ్రీనివాసుల రెండవ వార్షికోత్సవ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. రాయికల్ మండలంలో ఉన్న ప్రతి శ్రీనివాసుడు తప్పకుండా కార్యక్రమానికి హాజరు కావాలని, ఉమ్మడి జిల్లా కరీంనగర్ శ్రీనివాసులు ఒకే వేదికపై దాదాపు 2 వేల మంది నుంచి 3 వేల మంది కలువగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదు కార్యక్రమం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయికల్ మండల శ్రీనివాసుల సేవా సమితి ఇన్‌చార్జి డాక్టర్ కటకం శ్రీనివాస్, గడ్డల శ్రీనివాస్, ఉదుత శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీఎం కిసాన్ యోజనపై వీడియో కాన్ఫరెన్స్

కథలాపూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకం వల్ల రైతులకు అందే ప్రయోజనంపై శనివారం కేంద్ర మార్కెటింగ్ శాఖ అధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కథలాపూర్ ఏఎంసీ పాలకవర్గం పాల్గొన్నారు. ఇప్పటివరకు కేంద్రం రైతుల ఖాతాల్లో ఎకరానికి ఏడాదికి ఆరువేల చొప్పున రూ. 42 వేల కోట్లు జమ చేసిందని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ పులి శిరీషహరిప్రసాద్, డైరెక్టర్లు వాకిటి రాజిరెడ్డి పాల్గొన్నారు.

లింకు రోడ్ల మరమ్మతుకు మోక్షమెప్పుడో..?

● ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు ● పట్టించుకోని పాలకులు

కథలాపూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా, మండల, గ్రామ సరిహద్దులను కలిపే లింకు రోడ్లు పూర్తిగా దెబ్బతిని రాకపోకలు నరకప్రాయంగా మారాయి. ఏళ్ల తరబడి పాలకులకు వినతి పత్రాలు ఇస్తున్నా పల్లెలపై చిన్నచూపు చూస్తూ గ్రామీణ రవాణా వ్యవస్థను గాలికి వదిలేశారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతీ పల్లెకు రోడ్లు బాగుంటేనే వ్యాపార, వాణిజ్య రంగాలు మెరుగుపడడానికి ఆస్కారం ఉంటుంది. వర్షాకాలంలో మోకాలి లోతు గుంతలు ఏర్పడి కనీసం కాలినడకన కూడా వీలు లేకుండా ఉంది. కేవలం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలపైనే దృష్టి సారిస్తున్న ప్రజాప్రతినిధులు లింకు రోడ్లను మెరుగుపరచడం పట్ల ఎందుకు నిర్లక్ష్యం కనబరుస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

● మారుమూల పల్లెలపై నిర్లక్ష్యం

పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు అని వల్లెవేస్తున్న పాలకులు మారుమూల పల్లెల రోడ్లపై నిర్లక్ష్యం కనబరుస్తున్నారు. మండలంలోని తుర్తి- తాండ్రియాల, అంబారిపేట-తాండ్రియాల, భూషణరావుపేట-చింతకుంట వడ్డెర కాలనీ, ఇప్పపల్లి నుంచి గిరిజన తండా, తుర్తి నుంచి రుద్రంగి మండల కేంద్రానికి వెళ్లే లింకు రోడ్లు అధ్వానంగా మారి రాకపోకలు సాగించడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆదేవిధంగా చింతకుంట నుంచి నిజామాబాద్ జిల్లా కోనాపూర్ వెళ్లే జిల్లా సరిహద్దులను కలిపే రోడ్డును పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. లింకు రోడ్ల నిర్మాణం లేక ఆటు వైపు పంట పొలాలకు వెళ్లడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కాగా చింతకుంట- కథలాపూర్, కోనాపూర్ - భూషణరావుపేట, కథలాపూర్ - భూషణరావుపేట గ్రామాలకు రెండు సంవత్సరాల కిందట నిధులు మంజూరైనా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడంలో అలక్ష్యం ప్రదర్శిస్తున్నారు. పోసానిపేట ఎల్లమ్మ నుంచి దూలూరు మీదుగా సిరికొండ లింకు రోడ్డు కోసం పలుమార్లు సర్వేలు చేసినా ప్రభుత్వాలు నిధులు కేటాయించని కారణంగా రోడ్డంతా చిత్తడిగా మారి ఇబ్బందులు పడు తున్నారు. తుర్తి నుంచి రుద్రంగికి పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల కష్టాలు చెప్పనలవి కాకుండా ఉన్నాయి. ప్రభుత్వం గ్రామాల అనుసంధాన రోడ్లకు నిధులు కేటాయించి నిర్మాణాలు చేపడితే ప్రజల అవస్థలు తొలగిపోనున్నాయి.


అధ్వాన్న స్థితిలో రుద్రంగి-తుర్తి రోడ్డు

రోడ్లు బాగు చేయాలి
ప్రవీణ్, తుర్తి గ్రామ బీజేపీ నేత



పల్లెలను కలిపే రోడ్లను బాగు చేస్తేనే రవాణా వ్యవస్థ మెరుగుపడుతుంది. వర్షాకాలంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. మండలాలు, జిల్లాలు కలిపే రోడ్లపై దృష్టి సారించి నిధులు విడుదల చేయాలి. ప్రజల విన్నపాలను ప్రజాప్రతినిధులు పట్టించుకుంటే మేలు జరుగుతుంది. రోడ్లు మెరుగైతే వ్యాపారాభివృద్ధి పెరగడానికి అవకాశం ఉంటుంది.

ధాన్యం సేకరణకు ప్రణాళిక సిద్ధం
(ఐదో పేజీ తరువాయి)

క్వింటాలుకు రూ.2389కి తోడుగా క్వింటాలుకు రూ.500 బోనస్, సాధారణ బీ గ్రేడ్ రకానికి రూ. 2369 మద్దతు ధర నిర్ణయించారు. గత ఏడాది కంటే ఆదనంగా మద్దతు ధర పెరిగింది. కాగా ధాన్యంలో 17 శాతం కంటే తక్కువ తేమ ఉన్నప్పుడే మద్దతు ధర లభిస్తుందని అధికారులు అంటున్నారు. రైతులు ధాన్యం బాగా ఆరబోసి కేంద్రాలకు తీసుకొస్తే తూకం వేయడంలో ఇబ్బందులు ఉండవని అధికారులు సూచిస్తున్నారు.

సేంద్రియ సాగుపై దృష్టి సారించాలనడం హర్షణీయం


ప్రధాని మోదీ ప్రసంగాన్ని వీక్షిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

జగిత్యాలరూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ సాగు పెంచాలని తన ప్రసంగంలో పేర్కొనడం హర్షించదగ్గ విషయమని మాజీమంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషియోజన, ఆత్మనిర్భర్‌భారత్ పప్పుధాన్యాల మిషన్ కార్యక్రమాలను శనివారం ప్రధాని దేశవ్యాప్తంగా ప్రారంభించిన సందర్భంగా జగిత్యాల రూరల్ మండలం పొలాస రైతువేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పాల్గొని మోదీ ప్రసంగాన్ని వీక్షించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పప్పుదినుసులు, నూనెగింజలకు మద్దతు ధరకు అదనంగా రూ.వెయ్యి ప్రోత్సాహకంగా అందించాలని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి కోరారు. ఈవిషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాస్తానని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి భాస్కర్, పొలాస మాజీ సర్పంచ్ గాజంగి భారతినందయ్య, ఏవో, పలువురు ఏఈవోలు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ పద సంచలన్

దర్మపురి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి ఐండలోని పలు వీధుల్లో ఆర్ఎస్ఎస్ పద సంచలన్ శనివారం ఘనంగా నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి నేటి విజయ దశమితో వంద సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా పట్టణ వీధుల్లో పద సంచలన్ నిర్వహించారు. పట్టణంలోని గాంధీ విగ్రహం నుంచి ప్రారంభమైన సర్దార్ వల్లభాయ్ పటేల్, మదిరికవాడ, బ్రాహ్మణ సంఘం, దేవాలయం, నందిచౌక్, అంబేద్కర్ కూడలి, హనుమాన్‌వాడ, కొత్తపేటవాడ శివాజీ విగ్రహం మీదుగా టీటీడీ కళ్యాణ మండపం వరకు స్వయం సేవకుల పద సంచలన్ కొనసాగింది. ఈ సందర్భంగా స్వయం సేవకులు మాట్లాడుతూ సంఘం వంద ఏళ్ల పండుగ స్వయం సేవకుల్లో ఉత్సాహాన్ని నింపిందని అన్నారు. రాబోవు రోజుల్లో సమాజంలో చేసే విస్తృతమైన పనులు ప్రతి గృహాన్ని కలిసి సంఘ ఆలోచనని తెలియజేసే కార్యక్రమమని పేర్కొన్నారు. వంద ఏళ్ల కార్యక్రమంలో సంఘ సేవ సమరసత ఆనమానతల రూపు మాపడం స్వదేశీ లాంటి కార్యక్రమాల వల్ల చైతన్యం తీసుక రావడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు రంగు లక్ష్మీనరహరి, సంగి నర్సయ్య, నేరెళ్ల తిరుపతి, నూతికట్ల సత్యం, మహేందర్, 350 మంది గనవేష ధారి స్వయం సేవకులు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న స్వయం సేవకులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి
● కలెక్టర్‌కు వినతి

కొడిమ్యాల, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నాన్‌ఆయకట్టు ప్రాంతాల్లో వరి పంట వేసుకున్న రైతుల వరి ధాన్యం కొనుగోలుకు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని పూడూర్ మాజీ సర్పంచ్ వెల్మల రాంరెడ్డి, జిల్లా కలెక్టర్, డీసీఎస్‌వో, డీఏవోలను పత్రికా ముఖంగా కోరారు. శనివారం మాజీ సర్పంచ్ విలేకరులతో మాట్లాడుతూ బోరు, చేద్దం బావుల కింద గత జూన్ మాసంలో వరి నాట్లు వేసుకున్న 30 శాతం మంది రైతులు గత వారం రోజుల నుంచి హార్వెస్టర్లతో కోసుకుంటున్నారన్నారు.

మహిళా సంఘాల, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనందున ఏ గ్రేడ్ వరి ధాన్యం, దొడ్డు వరిధాన్యం మద్దతు ధర క్వింటాకు 2389 రూపాయలు ఉండగా 1800 రూపాయలకు అమ్ముకొని నష్టపోతారని ఆందున ఆవేదన వ్యక్తం చేశారు. కొడిమ్యాల మండలం లాంటి ప్రాజెక్టుల్లో నీరు లేని ప్రాంతాల గ్రామాల్లోని రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని మాజీ సర్పంచ్ కోరారు. ధాన్యం ఆరబెట్టుటకు కళ్లలతో పాటుగా, వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పలిన్ షీట్లు, ప్యాడీ క్లీనర్ మిషన్లను ఏర్పాటు చేసినట్లే రైతులు మద్దతు ధరకు వరిధాన్యం అమ్ముకొని లాభాలు పొందుతారని మాజీ సర్పంచు రాంరెడ్డి అన్నారు.

‘వృద్ధుల పోషణ బాధ్యత వారసులదే’

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వృద్ధుల పోషణ బాధ్యత వారసులదే అని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరిఅశోక్ కుమార్ అన్నారు. వృద్ధుల్లో మనోధైర్యం నింపేందుకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు. జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్స్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వృద్ధుల ఆత్మహత్యల నివారణ- పిల్లల బాధ్యత అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సందర్భంగా హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ వృద్ధుల ఆత్మహత్యలు పాల్పడిన ఆ వ్యక్తిపై పారదర్శకత లక్షణ విచారణ జరపాలన్నారు. వృద్ధులైన తల్లితండ్రులకు ఆత్మహత్య అనే ఆలోచన రాకుండా మనోధైర్యం కల్పించాలని, వారి పిల్లలపై ఉందన్నారు. ఇంట్లోంచి గెంటివేయడం, వృద్ధులను వసతిగృహాల్లో చేర్పించడం, ఆస్తులను బలవంతంగా లాక్కొని వెళ్లగొట్టడం, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం వంటి చర్యలతో తీవ్ర మానసిక వేదనకు గురై, వృద్ధులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఆత్మహత్యలను నివారించాలనే ఉద్దేశ్యంతోనే సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహారావు సూచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో ఇలా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మానసిక వైద్యులను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జీఆర్ దేశాయ్, సంఘ బాధ్యులు విశ్వనాథం, ప్రకాష్‌రావు, హన్మంతరెడ్డి, విఠల్, మానాల కిషన్, భూమాచారి, కస్తూరి శ్రీమంజరి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్

కాంగ్రెస్ బలోపేతానికే ‘సంఘటన్ సృజన్ అభియాన్’


ఏఐసీసీ పరిశీలకుడు నరేష్‌తో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీలను శక్తివంతం చేయడం చేయడం, పార్టీలో కొత్త జవాబుదారి వ్యవస్థను ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్‌గాంధీ సంఘటన్ సృజన్ అభియాన్‌ను ప్రారంభించనున్నారని ఏఐసీసీ పరిశీలకులు డాక్టర్ నరేష్ అన్నారు. శనివారం టీపీసీసీ అబ్జర్వర్ నియామకం ఆయన జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి ఆసిఫాబాద్‌లో సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో ఈ కార్యక్రమం విజయవంతంగా ప్రారంభం అయిందని తెలిపారు. పార్టీని గ్రామ స్థాయి వరకు విస్తరించి ప్రతి కార్యకర్తను మరుకుగా ముందుకు తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం ద్వారా ముందుకు వెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విఠల్, టీపీసీసీ ఉపాధ్యక్షులు అనిల్ కుమార్, ఆత్రం సుగుణ, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, విశ్వ ప్రసాద్, బాలేష్ గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో అలంకారప్రాయంగా బయోమెట్రిక్ యంత్రం

మల్యాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పారదర్శక విధుల నిర్వహణ కోసం కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం కార్యాలయంలో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ యంత్రం అలంకారప్రాయంగా మారిందని పలువురు ఉద్యోగ, సిబ్బంది విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ఆలయంలో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ యంత్రం మూలన పడగా ఐజీవేల అధికారులు ఈవో గది పక్కన ఏర్పాటు చేశారు. అయితే దాన్ని అర్చక, ఉద్యోగుల, సిబ్బంది నిత్యం వేలి ముద్ర వేసి విధులకు హాజరు కావాల్సి ఉంగా వాన్ని వినియోగించడం లేదు. విధుల నిర్వహణ సమయం 8 గంటలు కాగ అదనంగా విధులు నిర్వహించడంతో దాన్ని వినియోగించడం లేదని అంటున్నారు. ఎనిమిది గంటలకు మించి విధులతో తీవ్ర ఆసౌకర్యంకు గురి అవుతున్నట్లు ఉద్యోగ, సిబ్బంది అంటున్నారు. ఒక్కోసారి వేకువజాముగా వచ్చి రాత్రి వరకు ఉండాల్సి వస్తుందని వాపోతున్నారు. అందుకే బయోమెట్రిక్ యంత్రంను వినియోగించడం లేదని, వినియోగిస్తే ఎనిమిది గంటలు పూర్తి కాగానే వెళ్లే అవకాశం ఉంటుందని అలా వెళ్లకూడదనే దాన్ని వినియోగం పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా బయోమెట్రిక్ యంత్రంను వినియోగంలోకి తీసుకురావాలని అంజన్న సిబ్బంది కోరుతున్నారు.


కార్యాలయంలో అమర్చిన బయోమెట్రిక్ యంత్రం

ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వర్‌రావుకు ఘన స్వాగతం


చాగంటికి స్వాగతం పలుకుతున్న ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు

దర్మపురి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రానికి వచ్చిన ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర్‌రావు శనివారం ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా నంది విగ్రహ చౌరస్తా వద్ద నుండి మంగళ వాయిద్యాల వెంట రాగా ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు, వేదపండితులు, అర్చకులు, బ్రాహ్మణులు, స్థానికులు చాగంటికి పూల మాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుండి స్థానిక వీఐపీ ఎస్‌ఏ మినీ వంక్షన్ హాల్ వరకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి ఆయనను ఊరేగింపుగా తీసుక వెళ్లారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మదుసూదన్, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మున్సిపల్ కమీషనర్ మాల్య శ్రీనివాస్‌రావు, మండల తహసీల్దార్ పేరుకొండ శ్రీనివాస్, బ్రాహ్మణ సంఘం కార్యదర్శి నందగిరి గిరిధర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది, బ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ

● మెట్‌పల్లిలో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మల మూత్ర విసర్జన చేయకండి.. మరుగుదొడ్లను వాడండి.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి అని చెప్పే అధికారుల ఆచరణలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల నిర్వహణను గాలికి వదిలేయడంతో అవి అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ఆయా కార్యాలయాలకు, పట్టణాలకు వచ్చే ప్రజలు మూత్ర విసర్జనకు కూడా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి మెట్‌పల్లి పట్టణంలో నెలకొంది. పట్టణానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం మున్సిపల్ పరిధిలో కుఋసింగ్ పార్క్ వద్ద, కూరగాయల మార్కెట్ వద్ద, మున్సిపల్ కార్యాలయం వద్ద, రెడ్ క్రాస్ బిల్డింగ్ వద్ద, ఆరపేట వద్ద ప్రత్యేకంగా ప్రజా మరుగుదొడ్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో మొదట్లో కాంట్రాక్ట్ దక్కించుకున్న సదరు గుత్తేదారు కొంతకాలం నిర్వహించడంతో సక్రమంగా నడిచింది. సదరు గుత్తేదారుకు రావాల్సిన బకాయిలను చెల్లించకపోవడంతో నిర్వహణ భారంతో గాలికి వదిలేశారు. దీంతో లక్షలు వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి, సంబంధిత మున్సిపల్ అధికారులు వాటి నిర్వహణ పట్టించుకోకపోగా సిబ్బంది వాటికి తాళాలు వేసి వారి నిరుపయోగంగా మార్చారు. మెట్‌పల్లి డివిజన్ కేంద్రం కావడంతో వివిధ పనుల నిమిత్తం నిత్యం ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, మెట్‌పల్లి మండలాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఇక్కడికి వివిధ ప్రాంతాల నుంచి కూరగాయలు అమ్మేందుకు మహిళలు ఉదయం వచ్చి సాయంత్రం వరకు ఉండాల్సి వస్తుంది. కానీ ప్రజా మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉండటంతో మహిళలు మూత్ర విసర్జన చేసే లేక ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. పట్టణానికి వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలు, అధికారులు మరుగుదొడ్డి వసతి లేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజా మరుగుదొడ్లను వాడుకలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.


మెట్‌పల్లి రెడ్ క్రాస్ బిల్డింగ్ వద్ద తాళం వేసి ఉన్న ప్రజా మరుగుదొడ్డి

నిర్వహణ భారంగా మారింది
-మోహన్, మున్సిపల్ కమిషనర్



ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ భారంగా మారింది. దీంతో ప్రైవేట్ వ్యక్తులకు పే అండ్ యూజ్ కోరకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. గతంలో ఓసారి నోటిఫికేషన్ ఇచ్చాం కానీ నిర్వహణకు ఎవరూ ముందుకు రాలేదు.

పద్మశాలి సంఘం కార్యవర్గం

కోరుట్ల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలో నివాసం ఉంటున్న కథలాపూర్ మండల గంబీర్‌పూర్ గ్రామానికి చెందిన పద్మశాలి సంఘ నాయకులు నూతనంగా కార్యవర్గంను శనివారం ఏర్పాటు చేసుకున్నారు. సంఘ అధ్యక్షుడుగా వాసాల రాజగంగారం, ఉపాధ్యక్షులుగా గుంటుక సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా గుంటుక సురేష్, కోశాధికారిగా చిలివేరి గంగేశ్వర్‌ను ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు.

ట్రాక్టర్ డ్రైవర్ల ఆందోళన

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని 23వ వార్డు మాజీ కౌన్సిలర్ ఒజ్జెల బుచ్చిరెడ్డి ఇంటి ముందు శనివారం పట్టణానికి చెందిన కొందరు ట్రాక్టర్ యాజమానులు, డ్రైవర్లు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ తమ జీవనోపాధి కొరకు అనుమతులు తీసుకొని మొరం తరలిస్తుంటే ఒజ్జెల బుచ్చిరెడ్డి అడ్డుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పోలీసులు అక్కడకు చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు తెలుపడంతో ట్రాక్టర్ యాజమానులు, డ్రైవర్లు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు.

రాజన్నను భక్తులకు దూరం చేస్తే ఊరుకునేది లేదు..
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాజన్న ఆలయ అభివృద్ధి పేరుతో రాజన్నను భక్తులకు దూరం చేస్తే ఊరుకునేది లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. రాజన్న సిరిసిల్ల, వేములవాడ లోని బీజేపీ కార్యకర్తతో టెలికాన్ఫరెన్స్‌లో బండి సంజయ్ కార్యకర్తలకు పలు సూచనలు చేసినట్లు తెలిపారు. రాజన్న భక్తులను భీమన్న ఆలయంలో మొక్కులు చెల్లించుకోవాలంటే భక్తుల మనోభావాలను దెబ్బతీసినట్లు అవుతుందని, అభివృద్ధి జరిగిన అన్ని దేవాలయాల మాదిరిగా బాలాలయం నిర్మించి రాజన్న దర్శనభాగ్యం భక్తులకు కల్పించాలని, ఒకవేళ రాజన్న భక్తులకు రాజన్నను దూరం చేస్తే జిల్లా వ్యాప్తంగా ఉన్న హిందుత్వవాదులు, బీజేపీ కార్యకర్తలు కాషాయ దుస్తులు ధరించి రాజన్న ఆలయానికి చేరుకొని భక్తులకు దర్శనాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు పేర్కొన్నారు.

రైతులకు న్యాయం జరిగేలా చూడాలి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి

భీమారం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్ట్ కింద నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చూడాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. భీమారం మండల కేంద్రంతో పాటు మండలంలోని దేశాయిపేట గ్రామంలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నష్టపోయిన రైతులతో మాట్లాడారు. గత ఆర్నెళ్లుగా దాదాపు 71 మంది రైతులకు రైతు బీమా, రైతు భరోసా పథకాలు రావడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, పంజాల శ్రీనివాస్, వెన్న సురేష్, కార్యవర్గ సభ్యులు మునుగూరి హన్మంతు, సుతారి రాములు, భూమక్క, ఎండీ ముక్రం, శాంతక్క, వెన్నం రాద, ఆక్రమ్, కొల్లెల్ల సుమన్, భవన నిర్మాణ సంఘం ప్రధాన కార్యదర్శి రాంబాబు, దేవదాస్, ప్రజా నాట్య మండలి అధ్యక్షుడు బొల్లె లక్ష్మణ్, బొల్లె రాజయ్య, బట్టు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న చాడ వెంకట్ రెడ్డి

సమస్యల పరిష్కారానికి మద్దతు ఇవ్వాలి

రాయికల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆదివాసి తోటి జాతి సమస్యల పరిష్కారానికి మద్దతు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డిని శనివారం తోటి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కురిసెంగ వేణు కోరారు. ఆదివాసీ ఉద్యమాలలో వామపక్షాల పద్ధతి తప్పనిసరి అన్నారు. రాజ్యాంగపర హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి ఎండగట్టే తరుణంలో, ఆదివాసి తోటి జాతి పలు హక్కులను అమలుపరచే విధంగా చేస్తున్న పోరాటంలో గట్టి గళం వినిపించాలని కోరారు. ఆయన వెంట నాయకులు కురిసెంగ సుమన్ తదితరులు ఉన్నారు.